సాక్షి
ఒడిశా

ఆదివారం । 16 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ.9,87,027
బంగారం: 2 గ్రాముల 650 మిల్లీ గ్రాములు
వెండి: 123 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



హోలీ వేడుకల్లో విషాదాలు
రాష్ట్రంలోని హోలీ వేడుకల్లో పలు విషాదకర ఘటనలు చోటుచేసుకున్నాయి.
-8లో



రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి
డెంకనాల్‌లోని 55వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు.
-8లో

న్యూస్‌రీల్

ఢిల్లీ పర్యటనకు సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఢిల్లీ పర్యటనకు శనివారం మధ్యాహ్నం వెళ్లారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ పర్యటనలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ముఖ్యమంత్రి ఈ పర్యటనలో కేంద్రమంత్రులను కలిసే అవకాశం ఉంది.

బాల కార్మికులను రక్షించిన పోలీసులు



చిన్నారులతో అధికారులు

జయపురం: పట్టణంలో ముగ్గురు బాల కార్మికులను పోలీసులు రక్షించారు. బాలలు గ్యారేజీలలో పనిచేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఇతర విభాగాల అధికారులతో కలిసి దాడులు జరిపినట్లు పట్టణ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ వెల్లడించారు. వీరంతా 12 నుంచి 13 ఏళ్ల వయస్సు లోపువారని వెల్లడించారు. వారిని శిశు సంక్షేమ విభాగ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరచామన్నారు. వారితో పాటు ప్రభుత్వ లేబర్ అధికారి చైతన్య మాఝి, పట్టణ ఎస్ఐ మనీష సాహు, చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ తపస్వినీ పాడి, బలరాం పాత్రో ఉన్నారు.

నాటుసారా పట్టివేత



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ ఎక్సైజ్ సిబ్బంది భారీగా నాటుసారాతో పాటు సారా తయారు చేసేందుకు సిద్ధం చేసి ఇప్ప ఊటను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి భగవాన్ మహానందియ శనివారం తెలియజేశారు. బొయిపరిగుడ ఎక్సైజ్ పరిధి లిమ్మ ప్రాంతంలో నాటుసారా కాస్తున్నట్లు సమాచారం రావడంతో అధికారులు దాడులు చేశారని వెల్లడించారు. దాడిలో 200 లీటర్ల నాటుసారాతో పాటు 5,500 లీటర్ల ఇప్ప ఊట స్వాధీనం చేసుకొని పారవేశారు. దాడిలో డీఎఫ్ఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర పాడియారి, కొరాపుట్ ఎక్సైజ్ అధికారి జగబందు జాని, జయపురం ఎక్సైజ్ అధికారి రాజు భీధి, శుబ్రత్ కేశరి హిరెన్ తదితరులు పాల్గొన్నారు. ఎక్సైజ్ సిబ్బందిని గమనించి నాటుసారా మాఫియా వ్యక్తులు పరారయ్యారు.

ఇంట్లో రెండు మృతదేహాలు

భువనేశ్వర్: ఒక ఇంట్లో రెండు మృతదేహాలను పోలీసులు గుర్తించారు. స్థానిక చంద్రశేఖర్‌పూర్ హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం ఈ ఘటన వెలుగు చూసింది. ఇంటి డాబాపై గదిలో మృతదేహాలను గుర్తించారు. చంద్రశేఖర్‌పూర్ ఠాణా పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు ప్రారంభించారు.

చెట్టుకు ఉరి వేసుకొని ప్రేమికుల ఆత్మహత్య




చెట్టుకి వేలాడుతున్న భగవాన్, సబితల మృతదేహాలు

కొరాపుట్: ఒకే చెట్టు కొమ్మకి ఇద్దరు ప్రేమికులు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన చోటుచేసుకుంది. శనివారం ఉదయం నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి చిత్తా బెడా గ్రామ పంచాయతీ సియునాగుడ గ్రామ సమీపంలోని తోటలో ఈ ఘటన వెలుగు చూసింది. అదే గ్రామానికి చెందిన లక్ష్మీ గౌడ ఏకైక కుమారుడు భగవాన్ గౌడ (21), పక్కనే ఉన్న వలియాగుడ గ్రామానికి చెందిన శనివారి బోత్ర కుమార్తై సబితా బోత్రా (18)లు ప్రేమించుకున్నారు. వీరిద్దరిదీ వేర్వేరు కులాలు కావడంతో పెద్దరు వ్యతిరేకించారు. దీంతో పెద్దలను ఎదిరించలేక ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి వీరిద్దరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేసి నిద్రకి ఉపక్రమించారు. అనంతరం కుటుంబ సభ్యులు నిద్రలోకి జారుకోగానే సమీప అడవివైపు వెళ్లిపోయారు. కాగా వీరిద్దరూ కనిపించకపోవడంతో జొరిగాం పోలీస్‌స్టేషన్‌లో రెండు కుటుంబాలకు చెందిన పెద్దలు వేర్వేరుగా ఫిర్యాదులు చేసుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టగా ఒక చెట్టుకు వీరిద్దరూ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం గుర్తించారు. జొరిగాం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

రంగ్‌దే...!







రాజమౌళి, మహేష్‌బాబు సినిమా షూటింగ్‌లో హోలీ వేడుకలు

రంగుల పండగ హోలీని శనివారం ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పల్లెలు.. పట్టణం అని తేడా లేకుండా తెల్లవారుజాము నుంచే యువతీ, యువకులు, వృద్ధులు రంగులతో వీధుల్లో సందడి చేశారు. స్నేహితులతో పాటు కనిపించినవారికి రంగులు పూస్తూ కేరింతలు కొట్టారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: హోలీలో పాల్గొన్న రాయగడ, బిసంకటక్ ఎమ్మెల్యేలు



రాయగడ: హోలీలో కాంగ్రెస్ నాయకుడు ఎంపీ సప్తగిరి తదితరులు



రాయగడ: కల్యాణ సింగుపూర్‌లో రాధాకాంతుడి ఊరేగింపు



రాయగడ: మజ్జిగౌరి అమ్మవారికి రంగులు పూస్తున్న సేవకుడు బెరుక్



మల్కన్‌గిరి: డైలీ మార్కెట్ వద్ద హోలీ వేడుకలు



పర్లాకిమిడి: కృష్ణచంద్ర గజపతి శ్మశాన వాటిక వద్ద...



కొరాపుట్: హోలీ వేడుకల్లో మంత్రి నిత్యానంద గొండో



మల్కన్‌గిరి: హోలీ వేడుకల్లో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి



జయపురం: అభిమానులతో ఎమ్మెల్యే బాహిణీపతి



జయపురం: జైలు రోడ్డులో...



కొరాపుట్: కుటుంబ సభ్యులతో దాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి తదితరులు



కొరాపుట్: దక్షిణ పశ్చిమాంచల్ డీఐజీ అఖిలేశ్వర్ సింగ్ హోలీ సంబరాలు



కొరాపుట్: ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి నివాసంలో వేడుకలు



కొరాపుట్: కేంద్రీయ విశ్వ విద్యాలయంలో హోలీ సంబరాలు

బీజేపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన బూదర పంచాయతీ ప్రజలు



మాట్లాడుతున్న నబకిశోర్ శోబోరో తదితరులు

పర్లాకిమిడి: స్థానిక ఇరదల వీధిలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నబకిశోర్ శోబోరో ఆధ్వర్యంలో పార్టీలో శనివారం చేరికలు జరిగాయి. కాశీనగర్ సమితి బూదర పంచాయతీకి చెందిన నాయిబు సర్పంచ్ ఇన్‌చార్జి హేమలత సామల్, బీసీసీ బ్యాంకు సొసైటీ అధ్యక్షుడు ఆయి మన్మథరావు, బీజేడీ పార్టీ యువజన విభాగ నాయకుడు ఆయి రామకృష్ణ, గౌరి గ్రామం నుంచి కె.త్రినాథరావు, కె.హరి, మాజీ వార్డు సభ్యుడు బాపూజీ పట్నాయక్, జి.కాంతారావు, ఎ.సూర్యనారాయణ, ఎం.తిరుపతి, జి.భాస్కర్‌రావు తదితరులు బీజేపీలో చేరారు. వీరందికీ బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్ద ఎత్తున పంచాయతీ ప్రజలంతా పార్టీలో చేరడంతో మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు.

జైన మందిర పునర్నిర్మాణానికి చర్యలు

జయపురం: పట్టణంలోని ప్రధాన మార్గంలో ఉన్న జైన మందిరాన్ని పునర్నిర్మించేందుకు జైన సమాజం నిర్ణయించింది. దీనిలో భాగంగా దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మించిన మందిరాన్ని శనివారం కూలగొట్టారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో మందిర నిర్మాణం చేపట్టనున్నారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. జయపురం సామ్రాజ్యంలో జైన మతానికి ఎంతో చరిత్ర ఉంది. ఆంగ్లేయులు ఈ ప్రాంతానికి రాక ముందే ఈ ప్రాంతానికి జైన మత గురువులు వచ్చి జైన మత ప్రచారం చేపట్టినట్లు చరిత్రకారుల అభిప్రాయం. సుబాయి, బొరిగుమ్మ, భైరవ సింగపూర్, కెచల తదితర ప్రాంతాల్లో నేటికీ అనేక ప్రాంతాల్లో జైన ప్రచార చిహ్నాలు కనిపిస్తాయి,



కూలగొట్టిన పాత జైన్ మందిరం

పోలీసులతో సీఎం హోలీ వేడుకలు



హోలీ పండగ స్నేహానికి ప్రతీక అని సీఎం మోహన్ చరణ్ మాఝి అభివర్ణించారు. పండగను శనివారం ఆయన పోలీసులతో జరుపుకున్నారు. రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ వై.బి.ఖురానియా ఆధ్వర్యంలో పోలీసు ఉన్నతాధికారుల బృందం ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

– భువనేశ్వర్

క్లుప్తంగా

రెవెన్యూ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం



బుక్కూరు ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగులకు సేవలు అందించడంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా రెవెన్యూ వసతి గృహం ఆధునికీకరణ, మెగా మెడికల్ క్యాంపు ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం జిల్లాకు వచ్చిన ఆయన జిల్లాకు చెందిన సీనియర్ రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు బుక్కూరు ఉమామహేశ్వరరావు, పి.జగన్‌మోహన్‌రావు, ఎం.కాశీప్రసాద్‌లను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం కార్యదిర్శ రామశెట్టి రాజేష్, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి బి.వి.ఎస్.ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాదిలాపు శ్రీనివాసరావు, ప్రవల్లిక, దిలీప్ చక్రవర్తి, కలెక్టరేట్ పరిపాలనాధికారి గుడ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జెమ్స్‌లో అవగాహన సదస్సు

శ్రీకాకుళం రూరల్ : రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఉద్యోగ అవకాశాలు – శిక్షణా తరగతులపై ఈ నెలాఖరున అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిమ్స్ గ్రూప్ చైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు హాజరవుతారని పేర్కొన్నారు. అర్హులైన వారికి ఏడాది శిక్షణ కాలంలో స్టైఫండ్ కూడా అందిస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డయాలసిస్ యూనిట్లు ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో శనివారం ఎనిమిది నూతన డయాలసిస్ యూనిట్లను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. అనంతరం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ సెక్రటరీ వెంకన్న చౌదరి, ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మజ, నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న నారాయణశెట్టి రవణమ్మ(63) అనే వృద్ధురాలి చీరకు నిప్పంటుకోవడంతో గాయాలపాలై మృతిచెందింది. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రవణమ్మ శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో ఇంట్లో కరెంట్ పోవడంతో కొవ్వొత్తి వెలిగించగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని మోకాలి వరకు పూర్తిగా కాలిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈమెకు భర్త సత్యనారాయణ, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్‌తో అపార ఉద్యోగావకాశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: పదో తరగతి తర్వాత తక్కువ వయసులోనే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే పాలిటెక్నిక్ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల ఇన్‌చార్జి గురుగుబెల్లి దామోదర్‌రావు అన్నారు. కళాశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఏపీఎస్‌బీటీఈటీ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చన్నారు. ఉమ్మడి జిల్లాలో పది ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయని చెప్పారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 300, మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 120, సీతంపేట మోడల్ పాలిటెక్నిక్‌లో 120 సీట్లు ఉన్నాయని వివరించారు. 10వ తరగతి పరీక్షలు పూర్తయ్యాక ఉచితంగా కోచింగ్ ఇచ్చి స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు.

హోలీ వేడుకల్లో విషాదాలు



సాహిద్ నగర్ ప్రాంతంలో హత్యకు గురైన యువకుని మృతదేహం

భువనేశ్వర్: సరదా సంతోషాల రంగుల పండగ వేడుకల్లో రాష్ట్రంలోని పలుచోట్ల విషాదం అలముకుంది. హత్యలు, ఘర్షణలతో ఈ పరిస్థితి తాండవించింది. ఈ పరిస్థితులు శాంతిభద్రతల వ్యవస్థకు పెను సవాలుగా నిలిచాయి. రాజధాని నగరంలో జంట హత్యలు జరిగాయి. శనివారం వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురై మరణించారు. తొలి సంఘటన సాహిద్ నగర్ ప్రాంతం శాంతిపల్లి మురికివాడలో జరిగింది. హోలీ వేడుకలు సందడిగా జరుగుతున్న సమయంలో కొంతమంది యువకులు వాగ్వాదం చేసుకున్నారు. అకస్మాతుగా నలుగురు దుండగులు ఒక యువకుడిపై కత్తులతో దాడి చేశారని ప్రత్యక్ష సాక్షుల కథనం. తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడికక్కడే మరణించినట్లు సమాచారం. మృతుడు గుప్పిగుణిగా గుర్తించారు. అతని భార్య అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఆమెపై కూడా దాడి జరిగి స్వల్పంగా గాయపడింది. కత్తిపోట్లకు బలైన వ్యక్తిని స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ప్రాథమిక దర్యాప్తులో నేరం వెనుక పాత కక్షలు ఉన్నట్లు తేలింది. సమాచారం అందడంతో సాహిద్ నగర్ ఠాణా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

సమీగొడియాలో యువకుడిపై దాడి

ఇటువంటి మరో ఘటన నగర శివారు మంచేశ్వర్ పోలీస్ ఠాణా పరిధి సమీగొడియా ప్రాంతంలో చోటు చేసుకుంది. గుర్తు తెలియని గుంపు దాడి చేసి ఒక యువకుడిని కత్తితో పొడిచి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. మృతుడు సమీగొడియాకు చెందిన ఆయుష్మాన్ పతి (27) గా గుర్తించారు. మంచేశ్వర్ ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అదేవిధంగా పశ్చిమ ఒడిశా సంబల్‌పూర్ ప్రాంతంలో కత్తిపోటు ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో సాహు కాలనీ యువకుడు హత్యకు గురయ్యాడు. అలాగే హోలీ పురస్కరించుకుని రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెచ్చుమీరి రాళ్ల దాడిని ప్రేరేపించింది. ఈ దాడిలో ఉభయవర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానిక జగత్‌పూర్ బిజూ కాలనీ మరియు హరిజన సాహి వ్యక్తుల మధ్య ఘర్షణ రగిలింది. జగత్‌పూర్ ఠాణా పోలీసులు అప్రమత్తమై ఘటన స్థలంలో డేరా వేశారు.

• లే.. పద పద..!



ఉపాధి పనులు పరిశీలిస్తున్న సమయంలో కూలీల కావిడి మోసి పనిభారం పంచుకున్నాడు నువాపడ కలెక్టర్ మధుసూదన్ దాస్. జిల్లాలోని కొమనా మండలం ముండాపోలా పంచాయతీలో ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను ప్రోత్సహించేందుకు నడుం బిగించారు. కార్మికుల తరహాలో మట్టితో నిండిన కావడి భారం భుజాన వేసుకొని ముందడుగు వేశారు. వారితో పాటు మండల అభివృద్ధి అధికారి బీడీవో సైతం కావిడి మోశారు. – భువనేశ్వర్

జగన్నాథుడిని దర్శించుకున్న హేమమాలిని



శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో ఎంపీ హేమమాలిని

భువనేశ్వర్: పార్లమెంటు సభ్యురాలు హేమమాలిని పూరీ సందర్శించి శ్రీమందిరంలో రత్నవేదికపై కొలువుదీరిన బలభద్ర స్వామి, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథుడు మరియు సుదర్శనుడు చతుర్ధామూర్తులను దర్శించుకున్నారు. శనివారం ఉదయం మంగళ హారతి తర్వాత లోపలి ప్రాంగణం నుంచి మూల విరాటులను ఆమె దర్శించుకున్నారు. అనంతరం శ్రీమందిరం సముదాయంలో నెలకొని ఉన్న విమలా దేవి, శ్రీ మహాలక్ష్మి దేవీని దర్శించారు.

పొరపాటు



ప్రయాణికుల సమాచారం కోసం రైలుపై ముద్రించే సమాచారంలో పొరబాటు చోటుచేసుకుంది. విశాఖపట్నం – గుణుపూర్ స్టేషన్ల మధ్య నడుస్తున్న 58506/58505 ప్యాసింజర్ రైలు బోర్డులో గుణుపూర్‌కు బదులుగా, ఒడియా భాషలో బ్రహ్మపూర్ అని తప్పుగా రాశారు. తూర్పు కోస్తా రైల్వే అధికారులు ఈ మేరకు సత్వర చర్యలు చేపట్టాల్సి ఉంది. – భువనేశ్వర్

తూనికల్లో మోసాలు అరికడతాం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తూనికల్లో ఎక్కడ ఎటువంటి తేడాలున్నా తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే చర్యలు చేపడతామని తూనికలు, కొలతల శాఖ ఏసీ విశ్వేశ్వరరావు తెలిపారు. 'మోసం గురూ' శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లాలో తూకాలకు సంబంధించి ఎక్కడ తేడా గుర్తించినా తూనికలు కొలతల శాఖ జిల్లా అధికారి శంకర విశ్వేశ్వరరావు(సెల్:9398153671), శ్రీకాకుళం డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.రాజారమేష్(సెల్: 9398124319), టెక్కలి డివిజన్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీధర్(సెల్:9398146671)లకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీ, 5వ లైన్, వార్డు సచివాలయం మేడపై ఉన్న తమ కార్యాలయంలో నేరుగా వచ్చి కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

గుజరాత్‌లో వలస కూలీ మృతి



వంక ప్రకాశ్(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని డోకులపాడు గ్రామానికి చెందిన వలస కూలీ వంక ప్రకాశ్ (36) గుజరాత్‌లో శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి తండ్రి కృష్ణ ఆరు నెలల కిందటే మృతి చెందాడు. నిరుపేద కుటుంబంలో ఆరు నెలల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రకాశ్‌కు తల్లి హేమలత, భార్య లలిత ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో వీధిన పడ్డ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు ,స్థానికులు కోరుతున్నారు.

ఆప్కాస్‌ను కొనసాగించాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలని కాంట్రాక్ట్ – ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా నాయకులు ఆర్.చిన్నారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మురళీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ – స్థానిక సంస్థలలోని ఔట్‌సోర్సింగ్, యూనివర్సిటీలు, ప్రభుత్వ సొసైటీలు, విద్యుత్, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష తదితర అన్ని ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఏపీ కాంట్రాక్ట్ –ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ముందుగా శ్రీకాకుళం ఆర్ అండ్ బీ బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆప్కాస్‌లో వివిధ విభాగాల ప్రతినిధులు నక్క శ్రీనివాసరావు, ధన్వంతరి, ప్రసాద్, గుజ్జల ఆదినారాయణ, రిమ్స్ ఉద్యోగులు కె.తేజ, టి.కిరణ్, టి.సాయి, జి.ధర్మారావు, జ్యోతికుమారి, మౌనిక, ప్రత్యూష, శిరీష పాల్గొన్నారు.

పాలనా వ్యవస్థలో రెవెన్యూ శాఖ కీలకం

• కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ పాలనా వ్యవస్థలో రెవెన్యూ శాఖ కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఇందులో పనిచేసే ఉద్యోగులు రేయింబవళ్లు పనిచేస్తూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరితో ఉంటారని, దీన్ని దష్టిలో పెట్టుకొని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ అతిథి గృహం ఆధునికీకరణను, వైద్య శిబిరాలను రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, అమరావతి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అధికారులు అంకితభావంతో పనిచేయటం వల్ల భూమి సమస్యలు లేని జిల్లాగా శ్రీకాకుళం రూపొందుతోందని చెప్పారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాన్ని రెవెన్యూ శాఖ కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు కె.శ్రీరాములు బి.వి.ఎస్.ఎన్.రాజు, పాదిలాపు శ్రీనివాసరావు, ప్రవల్లిక, కలెక్టరేట్ పరిపాలన అధికారి గుడ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

రెవెన్యూ సర్వీసులు సంఘం, డాక్టర్ శశిధర్ ఆస్పత్రి నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అన్నెపు శశిధర్, కార్డియాలజిస్టులు డాక్టర్ సాయితేజ బరాటం, డాక్టర్ పూజారి హరిబాబు, జనరల్ సర్జన్ డాక్టర్ చింతాడ గోవిందరావు, గైనకాలజిస్టు డాక్టర్ సనపల సుకన్య, ఆర్థోపెడిక్ డాక్టర్ కింతలికిషోర్, డాక్టర్ బమ్మిడి ప్రభులు వైద్య సేవలు అందించారు. ఆదివారం కూడా శిబిరం కొనసాగుతుందని డాక్టర్ శశిధర్ తెలిపారు. సీపీఆర్, బీఎండీ స్కాన్, థైరాయిడ్ పరీక్ష, డయాబెటిక్, యూరిక్ యాసిడ్, హిమోగ్లోబిన్, సర్వైకల్ కాన్సర్, బెస్టు క్యాన్సర్, ఈసీజీ, 2డీ ఎకో, జీఈఆర్‌డీ, బీఎంఐ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న తనూజ శతపతి

పర్లాకిమిడి: స్థానిక రాజగురువీధిలోని పోరిచ్చా మఠంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని గ్రాహక్ అధికార సురక్షా మంచ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తనూజా శతపతి, లింగరాజ్ పాణిగ్రాహి, మురళీ పోరిచ్చా, భాగవత్ పాఢి, రొక్కం చలపతిరావు, మోహిత్ మిశాల్ తదితరులు వినియోగదారుల హక్కులపై ప్రసంగించారు. ప్రతీ వ్యాపారి తన దుకాణం వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ పట్టణంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలిగిస్తుండడం, మీటర్ రీడింగ్‌లో అవకతవకలపై వినియోగదారుల ఫోరం తరఫున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

దోపిడీ కేసులో ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జితేంద్ర కుమార్ పండా



స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఆభరణాలు

పర్లాకిమిడి: స్థానిక రేఖానా వీధిలో గోబర హేమ ఇంట్లో ఈ ఏడాది జనవరిలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రేఖానా వీధిలో నివాసముంటున్న గోబర హేమ అత్త, మామలు వృద్ధులు. ఆమె జనవరి 17న తన భర్త ఉంటున్న ఆంధ్రప్రదేశ్‌లోని సింహాచలం వెళ్లింది. కాగా జనవరి 24న ఇంట్లో దొంగతనం జరిగింది. దీనిపై ఆదేరోజు ఆదర్శ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన మోడల్ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ కౌతికా శెఠి ముందుగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో పాతపట్నంకు చెందిన గోరుశెఠి గీతను అరెస్టు చేసింది. అనంతరం ఆమెను విచారించగా బంగారం వస్తువులు కొన్నటువంటి పర్లాకిమిడికి చెందిన బెండి రుసి ఆచారి, కాశీనగర్ సమితి విస్తల గ్రామానికి చెందిన మిషాల్ చందును కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 43.54 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితురాలు జి.గీత నుంచి రూ.48 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ జితేంద్రనాథ్ పండా వెల్లడించారు. నిందితులు ముగ్గురినీ శనివారం కోర్టులో ప్రవేశపెట్టామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు



రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

భువనేశ్వర్: డెంకనాల్‌లోని 55వ నంబర్ జాతీయ రహదారి ప్రాంతంలో గ్రామస్తులు రహదారి దిగ్బంధం చేశారు. ఈ ప్రాంతంలో హైవా ఢీకొని స్థానిక యువకుడు మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఆందోళనకు దిగారు. పరిహారం కోసం కుటుంబాలు రోడ్డెక్కాయి. ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకులకు మద్దతుగా గ్రామస్తులు 55వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీని ప్రభావంతో కటక్, సంబల్‌పూర్ మధ్య వాహనాల రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మార్గంలో ఉభయ దిశల్లో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలం సందర్శించిన పోలీసులు గ్రామస్తులను బుజ్జగించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నదుల పరిరక్షణ అందరి బాధ్యత



నాగావళి నదిలో శుభ్రం చేస్తున్న పీసీబీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నదులను కాలుష్యపు కోరల నుంచి పరిరక్షించాలని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కరుణశ్రీ అన్నారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో ఉన్న నాగావళి నదిలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ శ్రీకాకుళం– స్వచ్ఛ నాగావళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణశ్రీ మాట్లాడుతూ నదుల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని ఇందులో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నదుల దురాక్రమణ పర్యావరణ వినాశనానికి, నీటి వనరుల క్షీణతకు కారణమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్ నటుకుల మోహన్, మంత్రి వెంకటస్వామి, ఆంధ్రా ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఏఓఎల్) ఎం.కృష్ణయ్య, అపర్ణ ఫార్మాస్యూటికల్ ప్రైవేటు లిమిటెడ్ సీనియర్ మేనేజర్ శ్యామ్ బాబు, ఎపిటోరియా ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ లైజినింగ్ ఆఫీసర్ ప్రసాద్, మహాధన్ పరిశ్రమ హెచ్ఆర్ రాజేష్, సరాక కంపెనీ ప్రతినిధి ఎ.బ్రహ్మారెడ్డి, రాజశేఖరరెడ్డి, ఎప్టోరియా కంపెనీ జనరల్ మేనేజర్ సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి శశిభూషణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వర్ణాంధ్ర–2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి శశిభూషణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా వివరాలను కలెక్టర్ వివరించారు. బాహుదా ఓపెన్ హెడ్ చానల్, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, మూలపేట పోర్టు, నదుల అనుసంధానం, హిరమండలం రిజర్వాయర్ తదితర పనుల పురోగతిపై చర్చించారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని ఎస్ఈని ఆదేశించారు. ఉపాధి పీడీ సుధాకర్ మాట్లాడుతూ జాబ్‌కార్డులు, పని దినాలు, వేతనాలను వివరించారు. డీసీహెచ్ డాక్టర్ కళ్యాణ్‌బాబు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులకు సంబంధించి కొరత లేకుండా మందులు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ షకీలా, ఎంపీఐ గంగాధర్, డీఎఫ్ఓ వెంకటేష్, మైన్స్ శాఖ డీడీ మోహనరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీఓలు కృష్ణమూర్తి, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, లక్ష్మణమూర్తి, సివిల్ సప్లయ్ డీఎం వేణుగోపాల్, డీటీసీ ఎ.విజయ సారధి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, భూగర్భ గనుల శాఖ డీడీ మోహనరావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, డీఎస్ఓ సూర్యప్రకాష్, డ్వామా పీడీ సుధాకర్, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, సీపీఓ లక్ష్మీప్రసన్న, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతి శ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాషా, వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో నలుగురు చిన్నారులకు గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

సాలూరు: పట్టణంలోని 18వ వార్డు పరిధి దుర్గానవీధిలో నలుగురు చిన్నారులపై కుక్కలు దాడి చేశాయి. శనివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారులపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరి చాయి. వెంటనే స్థానికులు అప్రమత్తమై కుక్కలను తరిమేశారు. చిన్నారులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

ఖేలో ఇండియా పోటీలకు ముగ్గురు..



ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులతో అధికారులు

విజయనగరం: ఢిల్లీలో ఈ నెల 20 నుంచి 23 వరకు జరగనున్న ఖేలో ఇండియా క్రీడా పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ముగ్గురు పారా క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన క్రీడాకారులను శనివారం స్థానిక క్రీడాభివృద్ధి కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెలలో జరిగిన పారా ఒలింపిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో కిల్లక లలిత, దొగ్గా దేముడు నాయుడు, సుంకరి దినేష్ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిలో కిల్లక లలిత ఇప్పటికే ఢిల్లీలో జరుగుతున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో ఆడేందుకు వెళ్లగా.. మిగిలిన ఇద్దరు త్వరలో ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారని తెలిపారు. ఖేలో ఇండియా పోటీలలోనూ బాగా రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

27న స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరేడ్‌లో ఈ నెల 27న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పురుషులకు రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్ (75 రోజులు), సెల్‌ఫోన్ రిపేరింగ్ అండ్ సర్వీసింగ్ (30 రోజులు), జెంట్స్ టైలరింగ్ (30 రోజులు), హౌస్ వైరింగ్ (30 రోజులు).. అలాగే మహిళలకు టైలరింగ్ (30 రోజులు), కంప్యూటర్ డీటీపీ కోర్సు (45 రోజులు), మగ్గం అండ్ శారీ పెయింటింగ్ వర్క్స్ (30 రోజుల పాటు)లలో శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయాలుంటాయన్నారు. మరిన్ని వివరాలకు 90147 16255, 94917 41129, 98669 13371, 99899 53145 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ఎఫ్ఆర్ఓ ఉద్యోగాలకు రాతపరీక్ష

విజయనగరం అర్బన్: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ ఉద్యోగాల భర్తీకి సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే రాతపరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే, ఈ నెల 17న జరగనున్న ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. తన చాంబర్‌లో పరీక్ష ఏర్పాట్లపై శనివారం సమీక్షించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. జిల్లాలోని చింతలవలస వద్ద ఉన్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, గాజులరేగలోని అయాన్ డిజిటల్ సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కలెక్టరేట్ పరీక్షల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, వివిధ శాఖల ప్రతినిధులు, ఏపీపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

బొండపల్లిలో ఒకేషనల్ జవాబు పత్రాల మూల్యాంకనం

సీతంపేట: ఉత్తరాంధ్రంలోని ఇంటర్మీడియట్ వృత్తివిద్యా కోర్సు విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనం విజయనగరం జిల్లా బొండపల్లిలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 17 నుంచి మూల్యాంకనం జరగనుంది. గతంలో విశాఖపట్నం జైలు రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించేవారు. జనరల్ సబ్జెక్టుల మూల్యాంకనం యథావిధిగా పార్వతీపురం మన్యం జిల్లాలోని బెలగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు.

పైసలిస్తేనే.. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు

- నగదు అందిస్తేనే కొనసాగింపు
- ఉపాధి హామీ వేతనదారుల వద్ద నుంచి రూ. వంద వసూలు చేయాలని అల్టిమేటం
- ఏపీఓ ఆదేశాల ప్రకారం నగదు వసూలు చేస్తున్న ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..

మణ్యపురిపేట సీనియర్ మేట్‌గా పనిచేసిన గార రామలక్ష్మి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం రూ. 50 వేల నగదును రెండు నెలలు కిందట మండల ఉపాధి హామీ అధికారి కామేశ్వరరావుకు ఇచ్చింది. అయితే మరో రూ. 10 వేలు ఇవ్వాలని అతను డిమాండ్ చేశారు. డిమాండ్ చేసిన నగదు ఇవ్వకపోవడంతో గ్రామానికి చెందిన మరో మహిళకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియామకపత్రం అందజేశారు. ఆమె వద్ద నుంచి రూ. 30 వేలు తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే నగదు తీసుకున్న విషయం ఎంపీడీఓ, ఉపాధి హామీ పీడీలకు బాధితురాలు రామలక్ష్మి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి విచారణ చేపట్టలేదు. జిల్లా అధికారి నుంచి మండల అధికారి వరకు వసూలు చేసిన నగదు సర్దుబాటు అవుతుందని సమాచారం. అందుకే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే గత సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో బాధితురాలు రామలక్ష్మి ఫిర్యాదు చేయడంతో ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి మన్యపురిపేట పంచాయతీ కార్యాలయంలో శనివారం విచారణ చేపట్టారు.



మణ్యపురిపేటలో ఉపాధి హామీ ఏపీఓపై విచారణ చేస్తున్న ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి

గుర్ల:

గ్రామాల్లో పేదలందరికీ వంద రోజుల పని కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వం పేదలకు అందిస్తున్న వంద రోజుల పని నుంచి వారానికి రూ. వంద వసూలు చేసే సరికొత్త పథకాన్ని గుర్ల మండల ఉపాధి హామీ అధికారులు ప్రవేశ పెట్టడం విమర్శలకు దారితీస్తోంది. మండలంలోని 42 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఈ గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు వేతనదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారు. వేతనదారులు సక్రమంగా పని చేయడం లేదని బెదిరిస్తూ వారిని తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారు. వారానికి రూ. వంద నగదు ఇస్తే తక్కువ పని చేసినప్పటికీ టెక్నికల్ అసిస్టెంట్ సహాయంతో కొలతలను అధికంగా వేసి ప్రభుత్వం ప్రకటించిన గరిష్ఠ వేతనాన్ని మీఖాతాలో జమ అయ్యేలా ఆన్‌లైన్ చేస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లు వారికి చెబుతున్నారు. నగదు ఇస్తున్నట్లు స్థానిక నేతలకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నగదు వసూలుపై ఎవరైనా వేతనదారులు ప్రశ్నిస్తే సాంకేతిక కారణాలు చూపి ఉపాధి హామీ పనులకు వెళ్లకుండా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ. 50వేలు

మండలంలోని 42 పంచాయతీలలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లపై స్థానిక నేతలు ఫిర్యాదు చేయడమే తరువాయి ఫిర్యాదు వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్‌తో మాట్లాడి రూ. 50 వేలు ఇవ్వాలని, లేకపోతే నిన్ను తొలగిస్తామని ఉపాధి ఏపీఓ కామేశ్వరరావు హెచ్చరిస్తారు. వేతనదారుల నుంచి రూ. వంద నగదు వసూలు చేస్తున్నప్పటికీ, ఫిర్యాదు వచ్చిన ప్రతిసారీ రూ. 50 వేలు ఇవ్వాలని ఒత్తిడి రావడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు లబోదిబోమంటున్నారు. మండలంలోని మణ్యపురిపేట, రాగోలు ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఫిర్యాదు రావడంతో రూ. 50 వేలు ఇవ్వాలని ఉపాధి ఏపీఓ డిమాండ్ చేశారు.

30,775 వేతనదారులు

మండలంలోని 42 పంచాయతీలలో 19,548 జాబ్ కార్డులున్నాయి. వీరిలో 34,711 మంది వేతనదారులు ఉపాధి హామీ పనుల కోసం దరఖాస్తు చేసుకోగా.. 30,775 మంది పనులకు హాజరవుతున్నారు. పనులు చేస్తున్న వారిందరి నుంచి వారానికి రూ. వంద వసూలు చేయడంతో వారానికి రూ. ముప్పై లక్షల పైనే నగదు వసూలవుతుంది. ఇంతా నగదు ఎవరి జేబుల్లోకి వెళ్తోందని వేతనదారులు చర్చించుకుంటున్నారు. దీనికితోడు గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లు చెరువుల వద్ద నిర్మించిన శిలాఫలకాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించిన నగదు సర్పంచ్‌ల ఖాతాలకు జమ చేయకుండా ఉపాధి హామీ అధికారుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేసుకున్నట్లు ఆరోపణలు వినబడుతున్నాయి.

వాస్తవం కాదు

ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమితులైన వారి నుంచి రూ. 50 వేల నగదు తీసుకున్నట్లు చేస్తున్న ఆరోపణలు నిజం కాదు. వేతనదారుల వద్ద నుంచి రూ. వంద వసూలు చేయడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా నగదు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులలో వాస్తవం లేదు .

కామేశ్వరరావు, ఏపీఓ, ఉపాధి హామీ పథకం , గుర్ల

రూ.50 వేలు ఇచ్చాను



మణ్యపురిపేట సీనియర్ మేట్‌గా పనిచేస్తున్న నాకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియామక పత్రం అందిస్తానని రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ. 50 వేలు ఇచ్చిన తర్వాత మరో రూ. 10 వేలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. రూ. 10 వేలు ఇవ్వకపోవడంతో మరో మహిళలకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారు. సీనియర్ మేట్‌గా ఉన్నప్పుడు గ్రామంలో పనిచేసిన 200 మంది నుంచి వారానికి రూ. 100 నగదు వసూలు చేసి టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓకి అందించాను.

గార రామలక్ష్మి, మణ్యపురిపేట

ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయించారు



రాగోలు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాపై ఒత్తిడి తీసుకువచ్చి రాజీనామా చేయించారు. నాపై ఫిర్యాదులు వస్తున్నాయని రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగదు ఇవ్వకపోవడంతో ఉపాధి హామీ పనులలో చాలా అవకతవకలు జరిగాయని బెదిరించారు. అవకతకవలలో నిజం అయితే మీ ఆస్తి అమ్మైనా ప్రభుత్వానికి చెల్లించాలని , లేనిచో మీ స్థిరాస్తులు వేలం వేయిస్తామని బెదిరించారు. రాజీనామా చేస్తే ఎటువంటి విచారణ ఉండదని చెప్పడంతో ఒత్తడికి తలొగ్గి రాజీనామా చేశాను.

పతివాడ శ్రీను, రాగోలు

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో అగ్రశ్రేణిలో నిలవాలి

- జిల్లా ప్రత్యేక అధికారి బాబు

విజయనగరం: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో విజయగనరం అగ్రశ్రేణిలో నిలవాలని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎ.బాబు ఆకాంక్షించారు. శనివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ జంక్షన్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎ.బాబు, కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, ఆర్డీఓ డి.కీర్తి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, తదితరులు పాల్గొన్నారు. ముందుగా గంటస్తంభం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదాలతో మహిళలు ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధిస్తామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను, ప్లాస్టిక్ వస్తువులతో రూపొందించిన గృహాలంకరణ వస్తువులను తిలకించారు. కార్యక్రమంలో వయోజనవిద్య డీడీ ఎ.సోమేశ్వరరావు, కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ వల్లి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నగర ప్రజలు

నేడు అమరజీవి జయంతి

పార్వతీపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి ఎస్. కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అధికారులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మన్యం జిల్లాకు మూడు అంబులెన్స్‌లు

సాలూరు: న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పార్వతీపురం మన్యం జిల్లాకు మూడు అంబులెన్స్‌లను కేటాయించింది. వీటిని స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం పట్టణంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, ఎన్‌పీసీఐ కొవ్వాడ కేంద్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి కామత్, అసోసియేట్ డైరెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు: గిరిబజార్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

గిరిబజార్‌ను ప్రారంభించిన మంత్రి

అంబులెన్స్‌లతో పాటు గిరిజనులకు నిత్యావసర వస్తువులు అందుబాటులో తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన గిరిబజార్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ వాహనాల ద్వారా నాణ్యమైన సరుకులను అందించడం జరుగుతుందని తెలిపారు.

మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు

మంత్రి సంధ్యారాణికు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

రోగులకు మెరుగైన సేవలను అందించేందుకే..

పార్వతీపురం: రోగులకు మెరుగైన సేవలను అందించేందుకు అదనంగా మూడు అంబులెన్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జిల్లాకు కేటాయించిన మూడు అంబులెన్స్‌లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు సకాలంలో సేవలు అందించేందుకు వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.



పార్వతీపురం: అంబులెన్సుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తదితరులు

ఆర్మీలో అగ్నివీర్ అవుతారా?

- అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో భారీ మార్పులు
- 13 భాషల్లో ప్రవేశ పరీక్ష రాసే అవకాశం
- ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో అభ్యర్థులకు బోనస్ మార్కులు
- విశాఖలో మరోసారి ర్యాలీ
- ఏప్రిల్ 10 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనుకునే యువతకు శుభవార్త. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రిక్రూట్‌మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రవేశ పరీక్షను ఏకంగా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. ఇది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మరోవైపు రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థుల కోసం ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విశాఖపట్నం మరోసారి వేదిక కానుంది. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఇటీవలే విడుదలైంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ కృష్ణా, మచిలీపట్నం జిల్లాల అభ్యర్థులకు విశాఖలో ఎంపికలు నిర్వహించాలని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం నిర్ణయించింది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఏప్రిల్ 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ కేటగిరీల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు. అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి, జనరల్ డ్యూటీ కేటగిరీలకు 10వ తరగతి అర్హతగా నిర్ణయించారు. అలాగే 17.5 నుంచి 21 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులే అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే ఈ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఏడాది కీలక మార్పులు

ఈ సారి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో పలు ముఖ్యమైన మార్పులు చేశారు. గతంలో అభ్యర్థులు ఒక కేటగిరీకి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఈసారి రెండు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమో వంటి అదనపు విద్యార్హతలు కలిగిన వారికి బోనస్ మార్కులు లభిస్తాయి. గతంలో హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను ఇప్పుడు తెలుగుతో సహా 13 భాషల్లో రాసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అడ్మిట్ కార్డులో ర్యాలీకి హాజరుకావాల్సిన తేదీ, సమయం వంటి వివరాలు ఉంటాయి. అభ్యర్థుల సౌకర్యం కోసం రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశంలో ప్రత్యేక రిపోర్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో పారదర్శకంగా జరుగుతుందని రక్షణ శాఖ తెలిపింది. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం లైవ్ చాట్ సదుపాయంతో పాటు 'ఆర్మీ కాలింగ్'అనే ఆన్‌లైన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మరింత సమాచారం కోసం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయాన్ని 0891-2756959, 0891-2754680 నంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సంఘటనా స్థలం వద్ద దెబ్బతిన్న వాహనాలు,(ఇన్‌సెట్లో) మృతుడు లక్ష్మణరావు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్‌పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై వి. జ్ఞాన ప్రసాద్ తెలియజేసిన వివరాల ప్రకారం.. సాలూరుకు చెందిన బ్రహ్మకుమారీలు మౌంట్‌అబూ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరిని పికప్ చేసుకునేందుకు బొలేరో వాహనంలో శాంబాన లక్ష్మణరావు (62) బొబ్బిలి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అనంతరం బ్రహ్మకుమారీలను ఎక్కించుకుని సాలూరు వెళ్తుండగా.. ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి స్టీరింగ్‌పై పట్టుకోల్పోయి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీ కొన్నారు. దీంతో వాహనం ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతో అందరూ గాయపడ్డారు. ఇదే సమయంలో అటుగా వస్తున్న ఆటో డ్రైవర్ కె. రమణబాబు క్షతగాత్రులను తన ఆటోలో ఎక్కించుకుని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా.. లక్ష్మణరావు అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అనంతరం క్షతగాత్రులు రాజరత్నం, సుజాత, తదితరులకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి అక్కడ నుంచి విశాఖ తరలించారు. ఎస్సై జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డెక్కిన పశువైద్య విద్యార్థులు



గరవిడి- విజయనగరం ప్రధాన రహదారిపై పశువైద్యవిద్యార్థుల నిరసన ర్యాలీ

- 41వ రోజుకు చేరుకున్న నిరవధిక దీక్షలు
- ప్రభుత్వ తీరుపై నిరసన

చీపురుపల్లిరూరల్ (గరివిడి): తమ సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని గరివిడి వెంకటేశ్వర వెటర్నరీ కళాశాల విద్యార్థులు కోరారు. కళాశాలకు వీసీఐ గుర్తింపు, స్టైఫండ్ రూ.25వేలకు పెంచాలని 41 రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్నా ప్రభుత్వానికి పట్టకపోవడంపై మండిపడ్డారు. దీనికి నిరసనగా గరివిడి-విజయనగరం ప్రధాన రోడ్డుపై శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద కాసేపు ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

ఆఖరి ప్రయాణం

- జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- నలుగురు మృతి
- ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు



ప్రమాదానికి గురైన కారు

ఎచ్చెర్ల క్యాంపస్/సంతకవిటి: శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడుమూరు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నాలుగు ప్రాణాలను గాల్లో కలిపేసింది. టైరు పంక్చర్ కావడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. చనిపోయిన నలుగురిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు. ఈ కుటుంబంలో ఆదివారం బర్త్‌డే వేడుకలు జరగాల్సి ఉంది. మరొకరి ఇంటిలో దత్తత వేడుక జరిగింది. కానీ వీరి విధిరాత మరోలా ఉంది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. పాతపట్నం గ్రామం పెద్దలోడి గ్రామానికి చెందిన దువ్వారి లక్ష్మీపతి(31) విశాఖపట్నంలోని మధురవాడలో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామంలో స్నేహితుడి వివాహానికి హాజరై శనివారం తిరుగు ప్రయాణమయ్యాడు. ఆదివారం తన అన్న బర్త్ డే ఉండడంతో తన కారులోనే తల్లి మీనమ్మ (56), బావ ఉగ్రపల్లి భాస్కరరావు (45), మేన కోడలు కుసుమ, తండ్రి కాళిదాసుతో కలిసి బయల్దేరారు. కారులో విశాఖ వెళ్తుండగా లావేరు మండలం బుడుమూరు సమీపంలో జాతీయ రహదారిపై కారు టైరు పంక్చర్ అయ్యి బండి అదుపు తప్పిపోయింది. సరిగ్గా అదే సమయానికి తోలాపి శంకరరావు(41) రోడ్డు పక్కన తన స్కూటీని ఆపి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అదుపు తప్పిన కారు అమాంతం శంకరరావును ఢీకొట్టి రోడ్డు పక్కన లేఅవుట్‌లోకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. ఘటనలో శంకరరావు తీవ్రంగా గాయపడి అక్కడే ఊపిరి వదిలేశాడు. కారులో ఉన్న మీనమ్మ, భాస్కరరావు సంఘటన స్థలంలోనే మృతిచెందారు. లక్ష్మీపతి, కాళిదాసు, కుసుమ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్‌లో వీరిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలీసులకు కూడా సమాచారం అందజేశారు. అయితే లక్ష్మీపతి ఆస్పత్రిలో చేరుస్తుండగానే కన్ను మూశారు. క్షతగాత్రులు అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. లావేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరైపోయింది..



మృతి చెందిన శంకరరావు

ఘటనలో చనిపోయిన శంకరరావు స్వగ్రామం విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మద్దూరిశంకరపేట. ఈయన రణస్థలంలోని యూబీ బేవరేజెస్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఏడాది కిందటే శంకరరావు కుమారుడు అనారోగ్యంతో చనిపోయాడు. అనంతరం ఆయన ఓ బాలికను దత్తత చేసుకున్నారు. ఆ బాలిక జనన ధ్రువీకరణ పత్రం కోసం శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి, చేపలు పట్టుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో భార్య జీవన కుమారి కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రమాదం గురించి సమాచారం తెలుసుకున్న వెంటనే ఆమె మద్దూరుశంకరపేట నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు వచ్చారు. ఏడాది కిందటే కుమారుడిని కోల్పోయి తీరని శోకంలో ఉన్న ఆమెకు ఇప్పుడు భర్త కూడా దూరం కావడంతో గుండెలవిసేలా రోదించారు.